బాబా కొలువు.. సేవలకు నెలవు.!

నిత్యాన్నదానం.. ఉచిత వైద్యం


బాబా మందిరం రెండో అంతస్తులో యోగా తరగతులకు హాజరైన వారు


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు


బాబా సన్నిధిలోని హాల్‌లో పంక్తి భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం, ఇన్‌సెట్‌లో బారులు తీరిన పేదలు

నల్లకుంట: ఆకలితో ఉన్న వారికి పిడికెడు అన్నం పెడితే వారి కళ్లల్లో కన్పించే సంతృప్తి వెలకట్టలేనిది. మానవ సేవయే మాధవ సేవగా భావించి దైవ సన్నిధిని వేదికగా మలచి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు సాయిబాబా భక్తులు. అన్నార్థులకు కడుపు నింపుతున్నారు. అవసరం మేరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. మానసిక ప్రశాంతతకు యోగ, ధ్యానం, వ్యక్తిత్వ వికాస తరగతులను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఆలయం... అధ్యాత్మిక చింతనకు కేంద్రం. బాగ్ అంబర్‌పేట, సాయినగర్ కాలనీలో ఉన్న శ్రీ షిర్డి సాయిబాబా ఆలయం అధ్యాత్మికతో పాటు అనేక సామాజిక సేవలకు నిలయం. 1997లో కొందరు భక్తులు సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌గా ఏర్పడి ఆలయాన్ని నిర్మించారు. ప్రతిరోజు ఇక్కడ పూజలతో పాటు పలు సేవా కార్యక్రమాలు ఉచితంగా నిర్వహిస్తున్నారు.

నిత్యం వెయ్యి మందికి

నిత్యం సుమారు 500 నుంచి వెయ్యి మంది నిరుపేదలకు అన్నదానం జరుగుతోంది. పోషక విలువలతో కూడిన హాట్ పొంగల్, వెజ్ భిర్యాని, టొమాటో రైస్, పులిహోర, బగార రైస్ ఇలా నిత్యం ఏదో ఒకటి పేదలకు వడ్డిస్తారు. ఉదయం బాబా హారతి ముగిసిన అనంతరం అన్నదానం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం కూడా వంద మందికి అన్నం ప్యాకెట్లు అందజేస్తారు. ఈ భోజనం కోసం బాబా దర్శనానికై విచ్చేసే భక్తులు, బాటసారులు, ఫుట్‌పాత్‌పై తదాచుకునే అభాగ్యులు, పాఠశాలలకు వెళ్లే చాలా మంది విద్యార్థులు తమతో పాటు హాట్ బాక్స్‌లు తెచ్చుకుని క్యూలో వేచి ఉండటం విశేషం. విద్యార్థులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

◆ ప్రతి నెల రెండు ఆదివారాలు మధ్యాహ్న హారతి అనంతరం బాబా సన్నిధిలోనే సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో పేద, ధనిక, ఉద్యోగులు, విద్యా వంతులు, నిరక్ష్యరాస్యులు అనే తేడా లేకుండా అందరిని సమానంగా పంక్తిలో కూర్చోపెట్టి అన్నం వడ్డిస్తారు. భక్తులు అన్నం తిన్న తరువాత విస్తర్లను ఆలయ వలంటీర్లే తొలగించి హాల్ శుభ్రం చేస్తారు. హాల్ శుభ్రం చేశాక మరో బ్యాచ్ కూర్చుంటారు.

నిత్యం ఉచిత యోగ తరగతులు.. ఉచిత వైద్యం..

సంస్థాన్‌లోని రెండో అంతస్తులో ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఉచిత యోగ, మెడిటేషన్ తరగతులు జరుగుతాయి. అన్ని వయసుల వారు ఈ శిక్షణకు హాజరవుతుంటారు. అదే విధంగా ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం(అల్లోపతి) ఉంటుంది. అలాగే కొన్ని ప్రత్యేక దినాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఇక్కడ రోగులకు అవసరమైన మందులు కూడా ఉచితంగానే అందిస్తారు. అలాగే మెడిటేషన్ హాల్‌లో తరుచూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుంటారు.

కోవిడ్ సమయంలో అన్నదానాలు..

కోవిడ్ సమయంలో సంస్థాన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిలిపి వేశారు. ఆ సమయంలో జీహెచ్‌ఎంసీ, పోలీసుల అనుమతులతో దాదాపు 4 నెలల పాటు ప్రతి రోజు వెయ్యి నుంచి 1500 మందికి సరిపడే అన్నం ప్యాకెట్లు తయారు చేయించి వలంటీర్ల ద్వారా వాటిని వాహనాల్లో తీసుకు వెళ్లి ఫుట్ పాత్‌లపై ఉండే అభాగ్యులకు, కొందరు ఇళ్లకు వెళ్లి వృద్ధులకు పంచిపెట్టారు. అలాగే వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు కూడా అందజేశారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు


బీజేపీ పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న పార్టీ నాయకులు నాగభూషణంచారి

అంబర్‌పేట: ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వానికి ముందుకొస్తున్నారని మాజీ మంత్రి కృష్ణాయాదవ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షులు నాగాభూషణంచారి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పలువురుకి పార్టీ సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, యశ్వంత్, నవీన్‌రెడ్డి, యాదగిరి, తిరుపతిగుప్తా, ఆయోధ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు


ధర్నాలో మాట్లాడుతున్న బుర్రా శ్రీనివాస్

కవాడిగూడ: పోక్సో చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు బుర్రా శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద పోక్సో చట్టం దుర్వినియోగం అడ్డుకోవాలని కోరుతూ మహిళలు, చిన్నారులతో కలిసి బుర్రా శ్రీనివాస్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నపిల్లలకు ప్రేమ పాఠం చెప్పానని తప్పుడు ఆరోపణలతో ఉపాధ్యాయురాలు కె. జ్యోతిర్మయి, వై. శేషలక్ష్మిలు 2021లో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు పెట్టించి తనను జైలుకు పంపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంగవైకల్యం ఉన్న తనలాంటి అమాయకులు బలికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తప్పుడు కేసులు పెట్టిన ఇద్దరు మహిళలను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులతో పాటు పలువురు పోక్సో చట్టం బాధితులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్వీపర్లు

బంజారాహిల్స్: స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని జీహెచ్‌ఎంసీ సిటీ మేనేజర్స్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో సర్కిల్–18కి చెందిన 340 మంది కార్మికులకు దంత, కంటి పరీక్షలను నిర్వహించారు. నగరంలోని పలు కీలక ఆస్పత్రులకు చెందిన వైద్యులు ఈ శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డీజీఎం సూర్యప్రకాశ్, రాజశేఖర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 28 వరకు మెగా లోక్ అదాలత్

గచ్చిబౌలి: మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఈ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ లోక్ అదాలత్‌లో డ్రంకన్ డ్రైవ్ కేసు, డ్రైవింగ్ లైసెన్స్ కేసు క్లియర్ చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు కోరారు. డాక్యుమెంట్లు రెండు సెట్ల ఆధార్ జిరాక్స్ పత్రాలు సమర్పించి కేసు కోసం హాజరై పరిష్కరించుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు కోర్టు పీసీ బాబురావు ఫోన్ నెంబర్ 9676765480లో సంప్రదించాలి.

రోబోటిక్ శస్త్ర చికిత్సలతో విప్లవాత్మక మార్పులు

బంజారాహిల్స్: 'రోబోటిక్'తో శస్త్ర చికిత్సలు విప్లవాత్మక మార్పులకు నాందిగా చెప్పవచ్చని అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఏఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మిథిన్ ఆచి తెలిపారు. ఇది ఖర్చులను కూడా గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ఖచ్చితమైన వైద్య సేవలకు అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌తో కలిసి తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టీఓఎస్‌ఏ), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ(టీసీఓఎస్) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో 8వ ఆర్థ్రోప్లాస్టీ సమ్మిట్–2024 (ఏఏఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోబోటిక్ శస్త్ర చికిత్స దీర్ఘకాలిక సమర్థత ఇంకా పరిశోధనలో ఉందన్నారు. హిప్ రీప్లేస్‌మెంట్ సమయంలో ఖచ్చితమైన కప్ పొజిషనింగ్, తీవ్రమైన మోకాలి వైకల్యాలు అధిగమించడంలో దీని ప్రయోజనాలు కాదనలేనివన్నారు. ఈ పురోగతి అధునాతన చికిత్సా ఎంపికలను మరింత సులభతరం చేస్తాయన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గౌతంనగర్‌లోని స్వర్ణకార వీధిలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఉప్పల్ భగాయత్‌లో జరిగిన యజ్ఞ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ నర్సింహాగుప్తా, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, రచయితల సంఘం అధ్యక్షుడు భైరి శంకర్, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్‌యాదవ్, నాయకులు శ్రీశైలం యాదవ్, సన్నీ యాదవ్, రమేష్ ముదిరాజ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్యం చారి, కోశాధికారి రవిచారి పాల్గొన్నారు.

అక్రమంగా నల్లా కనెక్షన్.. కేసు నమోదు

బంజారాహిల్స్: ప్రధాన పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి ఓ ఇంటికి నల్లా కనెక్షన్ తీసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ కె.శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఓ వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లోని గౌరీశంకర్‌నగర్‌లో జలమండలి మేనేజర్ కె. శివకుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా కరీంప్లాజా అనే ఇంటికి 15 ఎంఎంతో రెండు కనెక్షన్లు ఉన్నట్లుగా గుర్తించారు. అబ్దుల్ కరీం అనే వ్యక్తి వీటిని తీసుకున్నాడని, తాము దీనికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేయగా, బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏ రంగంలో ఉన్నా నైపుణ్యం ఉంటేనే రాణిస్తాం


యాదవ ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఏరంగంలో ఉన్నవారైనా నైపుణ్యం ఉంటేనే వృత్తిలో రాణించగలమని అఖిలభారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్న 50మంది యాదవ ఉపాధ్యాయులకు పురస్కారాలు జ్ఞాపిక, సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎంబీఏ చదివిన విద్యార్థులు కూడా న్యూస్ పేపర్ చదవలేకపోతున్నారని అందుకే ఏ వృత్తిలో ఉన్నా అందులో నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. యాదవ్స్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.శరత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు డేగల శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి అరుణ్ యాదవ్, కన్వీనర్ రవిచంద్ర యాదవ్, జితేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన రన్



ఖైరతాబాద్: టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సచివాలయం నుంచి సంజీవయ్య పార్కు వరకు అవగాహన రన్ నిర్వహించారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వల్ల చికిత్సలు అందుబాటులో ఉన్నాయనే విషయాలను తెలియజేస్తూ అవగాహన రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ హాస్పిటల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహార్ లక్ష్మి, డాక్టర్ రచన, ఎంఎన్‌జె హాస్పిటల్ డాక్టర్ రఘునాథ్ రావు, ఇండో అమెరికన్ కేన్సర్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కృష్ణమోహన్‌లతో పాటు 50 మంది వైద్యులు పాల్గొన్నారు.

'మనూ'లో విద్యార్థులు అంతరాయం కల్పిస్తే ఆన్‌లైన్ బోధన

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిస్థితిని సమీక్షించడానికి యూనివర్సిటీ ఉన్నతాధికారులతో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమావేశమయ్యారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనలు చేస్తే అందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాంపస్‌లో చక్కటి వాతావరణానికి అంతరాయం కల్పిస్తే క్యాంపస్‌లోని వసతి గృహాలను మూసి వేసి, విద్యార్థులు వాటిని ఖాళీ చేయించాల్సి వస్తుందని వారు స్పష్టం చేశారు. మిగిలిన సెమిస్టర్ తరగతులను ఎవరికీ ఇబ్బంది కలుగకుండా తరగతులను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కొందరు కావాలని తరగతులు జరుగకుండా అంతరాయం కల్పిస్తున్నారని దీన్ని ఎంత మాత్రం సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీకి తమ సమస్యలను వివరించేందుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటిది కాదంటూ అశాంతి వాతావరణం సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించమన్నారు.

'హానర్ వివాంటీస్'కు ఔత్సాహిక సొసైటీ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న హానర్ వివాంటీస్ సొసైటీ ప్రతినిధులు

రాయదుర్గం: ఇటీవల నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో గోపన్‌పల్లిలోని హానర్ వివాంటీస్ కమ్యూనిటీ అసోసియేషన్‌కు 'మోస్ట్ ఎంథ్యూజియాస్టిక్ సొసైటీ'అవార్డు దక్కింది. గణేష్ ఉత్సవ సమితి–2024లో భాగంగా కమ్యూనిటీ పర్యావరణ అనుకూల గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ రకాల మహా ప్రసాద వితరణ, భక్తిశ్రద్ధలతో వినాయకుడికి వీడ్కోలు పలకడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని గ్రేట్ గణేష్ అవార్డు–2024 సీజన్–5 తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఈ అవార్డులను అందించారు. హానర్ వివాంటీస్ కమ్యూనిటీ అసోసియేషన్ నుంచి శ్రీనివాస్‌బాల, రాహుల్ వెంకట్, వెంకట్ అంబటి, పూజాత్యాగి అవార్డును స్వీకరించారు.

పోలీస్‌శాఖకు సాయికుమార్ సేవలు ఎనలేనివి


ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్‌కు చెక్కును అందజేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): కానిస్టేబుల్ సాయికుమార్ విధి నిర్వహణలో అందించిన సేవలు మరిచిపోలేవని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కొనియాడారు. తనవంతు బాధ్యతగా తన రెండు నెలల గౌరవ వేతనం సాయికుమార్ కుటుంబానికి అందజేస్తున్నానని ఆయన ప్రకటించారు. సాయికుమార్ సంతాప సభ సైట్–2 సర్వాయి పాపాన్న కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మంచిపేరు సంపాదించిన సాయికుమార్ అకాల మరణం కలిచి వేసిందన్నారు. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ మాట్లాడుతూ మృదు స్వభావిగా సాయికుమార్ పోలీసు సిబ్బంది మన్ననలు పొందాడని వాపోయారు. అనంతరం సాయికుమార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సెక్టార్ ఎస్‌ఐ తుల్జారాం నాయక్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌కుమార్‌గౌడ్ కృష్ణవేణి, ఇమ్రాన్, శివకుమార్ గుప్తాతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నామంటూ భరోసా



బంజారాహిల్స్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గోపాలపురం కానిస్టేబుల్ పి. నర్సింహరాజు కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ళు అండగా నిలిచారు. ఈ సందర్భంగా 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ళు అంతా కలిసి రూ. 3.40 లక్షల నగదును రామంతాపూర్‌లో నివసించే నర్సింహరాజు సతీమణి మాధవికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఘనంగా ఇక్ఫాయ్ వ్యవస్థాపక దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న అతిథులు..

బంజారాహిల్స్: ఇక్ఫాయ్ విశ్వ విద్యాలయం 14వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన నారాయణ హృదయాలయ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ దేవీప్రసాద్ షెట్టి 'ఆధునిక వైద్య రంగంలో డిజిటల్ సేవల పాత్ర' అనే అంశంపై వర్చువల్‌గా ప్రసంగించారు. రానున్న కాలంలో మెరుగైన వైద్యం ప్రజలందరికీ అందుబాటులోకి రానున్నదని, సాంకేతికపరంగా వైద్య రంగంలో అనేక ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు ఆరోగ్య బీమాను సొంతంగా అందజేస్తే ఇది సాధ్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రోగులు, ఆస్పత్రులు, బీమా సంస్థలు ఒకరికొకరు నమ్మే పరిస్థితులు లేవని, ఆ పరిస్థితిని నివారించడానికి ఆస్పత్రులు ముందుకు రావలసిన అవసరం ఉన్నదని ఆయన పిలుపునిచ్చారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఈ క్రమంలో రోగులకు ఉపయుక్తమైన బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. అదేవిధంగా ప్రజలు తమ వైద్య పరీక్షల వివరాలను తమ మొబైల్ ఫోన్‌లలో భద్రపరచుకుని అందుబాటులోకి తెచ్చుకుంటే అత్యవసర పరిస్థితుల్లో మళ్ళీ మళ్లీ పరీక్షలు రాసే అవసరం రాదని వివరించారు. తద్వారా వైద్యులు సత్వర చికిత్సను అందజేసి రోగుల ఆరోగ్యాన్ని పరీక్షించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ కులపతి రంగరాజన్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ అందరికీ అందుబాటులో వైద్యం అనేది గురుతర బాధ్యతగా గుర్తించి ప్రజలకు సేవలందించాలన్నార. కార్యక్రమంలో ఉప కులపతి ఎల్ఎస్ గణేష్, విశిష్ట సలహాదారుడు మహేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు సాయిబాబా ఆలయ చైర్మన్‌గా సుధాకర్‌గుప్తా


వెనిశెట్టి సుధాకర్ గుప్తాను సన్మానిస్తున్న రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ముషీరాబాద్: ఆలేరు సాయిబాబా ఆలయ చైర్మన్‌గా వెనిశెట్టి సుధాకర్‌గుప్తా ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం పవిత్రానగర్‌లోని రాంనగర్ ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్‌గుప్తా, సంఘం సభ్యులు నేతి లక్ష్మణ్‌గుప్తా, సత్యవర్ధన్‌గుప్తా, కృష్ణమూర్తి గుప్తా, ఆంజనేయులుగుప్తా, నాగేందర్‌గుప్తా, ప్రకాష్‌గుప్తా, రఘుయాదవ్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


మహేష్‌కుమార్‌గౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న పాక జ్ఞానేశ్వరి

చిక్కడపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ మహిళా పాక జ్ఞానేశ్వరి, మాజీ మంత్రి షబ్బీర్ అలీతో కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం కృషి చేస్తుందన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



ముషీరాబాద్: రాంనగర్‌కు చెందిన వైష్ణవి అనే బాలిక 9వ తరగతి చదివి ఇంటిపట్టునే ఉంటోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం బాలిక సుల్తాన్ బజార్‌లోని తన స్నేహితురాలి ఇంటి వద్ద క్షేమంగా ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మృతి


చిన్నరాజు మృతదేహం

చిక్కడపల్లి: అనారోగ్యంతో ఆటో డ్రైవర్ ఆసుప్రతిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం రాత్రి ఎస్ఐ మౌనిక తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం... రాంనగర్‌లోని సన్ డిగ్రీ కళాశాల ఎదురుగా హోటల్ పక్కన వృద్ధుడు చిన్నరాజు (70) సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. అటుగా వస్తున్న బ్లూకోర్ట్స్, స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. అతనిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కూడా అక్కడ చేరుకుని వాకబు చేయగా అతనిది కర్ణాటక రాష్ట్రం వృత్తిరీత్యా ఆటోడ్రై వర్‌గా పనిచేస్తూ ఉండేవాడని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా రాంనగర్‌లోని మోహన్‌నగర్‌లో ఉంటూ జీవిస్తున్నాడు. కాగా చికిత్సపొందుతూ చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గాంధీమార్చురిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు చిక్కడపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.